Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 231 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 23 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## విజయవాడ 'వివేకానంద'లో సమ్మర్ క్యాంప్

### - పిల్లలకు ఆధ్యాత్మిక, యోగా తరగతులు







**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆత్మవికాస్-2026, సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఈ నెల 27నుంచి మే 9వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. నగరంలోని గాంధీనగర్‌లో రామకృష్ణా మిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'వివేకానంద సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్'లో 12 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. 4వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న పిల్లలకు ధ్యానం, యోగాసనాలు, వేద పఠనం, భజనలు, లీడర్‌షిప్ స్కిల్స్, చరిత్ర నిర్మాణం వంటివి ఇక్కడ నేర్పనున్నారు. ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు నిత్యం తరగతులుంటాయని నిర్వాహకులు తెలిపారు. సీట్లు పరిమితంగా ఉంటాయని, ఫీజు ఒక్కొక్కరికీ రూ.750 ధర నిర్ణయించామని ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఉత్తరాంధ్రకు మరో భారీ ప్రాజెక్ట్

### - రాంబిల్లిలో రెన్యువబుల్ విప్లవం - రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ - 2,100 మందికి ఉపాధి కల్పించేలా ఎనర్జీ ప్లాంట్ - శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, (రాజధాని వార్తలు):** పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పేరు మరోసారి మార్మోగనుంది. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పారిశ్రామిక వర్గాల్లో అనకాపల్లి జిల్లాపై జరిగిన చర్చ... ఇప్పుడు మరోసారి ప్రస్తావనకు రానుంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తిపై ఫోకస్ పెడుతున్న క్రమంలో ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆ రంగానికి హై ప్రయార్టీ ఇస్తోంది. దీంట్లో భాగంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలకు పెద్ద పీట వేస్తోంది. ఈ క్రమంలో రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్ప టికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి... ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగావాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి.

**త్వరలో రాయలసీమలో మరో భారీ ప్లాంట్**

రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యూవబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా...త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గంలో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ప్లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి.

**ఉత్తరాంధ్రలో అభివృద్ధి జోరు... పెట్టుబడుల హోరు**

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్‌వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా... ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం



**అమరావతి, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంతాల్లో అమలు అవుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై అధికారులతో సమగ్ర చర్చ. ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్, హాస్టళ్ల పనితీరును సమీక్షించిన మంత్రి. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆహారం, వసతి కల్పించాలన్నారు మంత్రి. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు మెరుగుపరచాలని అధికారులకు సూచన. తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడైన గిరిజన కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచన. గిరిజన మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ డైరెక్టర్ సదా భార్గవి పాల్గొన్నారు.

## తాళిబొట్లు తెంపి ఏం సాధిస్తావ్...?

### - జగన్‌కు మంత్రి సవిత సూటి ప్రశ్న - నాడు పిన్నమ్మ సౌభాగ్యాన్ని చెరిపేశారు - నేడు రవణమ్మ జీవితాన్ని నాశనం చేశారు - పెద్ద దస్తగిరి హత్య ముమ్మాటికీ తాడేపల్లి స్క్రిప్టే - జగన్ మేనమామకు పెద్ద దస్తగిరి ప్యాలెస్ గిఫ్ట్ ఇస్తే - ఆయన కుటుంబానికి డెడ్ బాడీ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిన వైసీపీ బ్యాచ్ - జగన్ అకృత్యాలకు, అరాచకాలకు బలయ్యేది ఎస్సీ, ఎస్టీ, బీసీలే - దస్తగిరి కుటుంబాన్ని జగన్ ఎందుకు పరామర్శించ లేదు - వైసీపీ గుర్తు గొడ్డలిగా మారిపోయింది - నమ్ముకున్నవారినే బలి తీసుకుంటున్న జగన్ : మంత్రి సవిత

**మంగళగిరి/అమరావతి, (రాజధాని వార్తలు):** నాడు పిన్నమ్మ సౌభాగ్యాన్ని హరించారు... నేడు నమ్ముకున్న పెద్ద దస్తగిరిని చంపించి ఆయన సతీమణి రవణమ్మ జీవితాన్ని నాశనం చేశారు... మహిళల తాలిబొట్లు తెంపి, ఏం సాధిస్తారు..? అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత నిలదీశారు. అధికారం కోసం, ఆస్తుల కోసం నమ్ముకున్న వారిని బలి తీసుకోవడం వైసీపీకి, జగన్‌కు అలవాటేనన్నారు. తాడేపల్లి స్క్రిప్ట్ ప్రకారమే పెద్ద దస్తగిరి హత్య జరిగిందన్నారు. శవయాత్రలు చేసే జగన్... పెద్ద దస్తగిరి కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. అక్రమ ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని వైసీపీ గూండాలు మట్టుబెట్టారన్నారు. ఈ కేసులో ఎంతటి వారున్నా వదలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ పార్టీ గుర్తు ఇప్పుడు గొడ్డలిగా మారిపోయిందన్నారు. జగన్ అకృత్యాలకు బీసీలు బలికావడం బాధాకరమన్నారు. మంగళగిరిలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. జగన్, ఆ పార్టీ నాయకుల ధన దాహానికి మరో బీసీ బలయ్యాడన్నారు. తాను చేసే అక్రమాలకు, అకృత్యాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీలను జగన్ వాడుకుంటున్నారన్నారు. అవసరం తీరగానే వారిని బలి తీసుకుంటున్నారని మండిపడ్డారు. కడపలో పెద్ద దస్తగిరి హత్య ఈ కోవలోకే వస్తోందన్నారు. వైసీపీ పాలనలో కడపలో దస్తగిరిని ముందు పెట్టి వైసీపీ ముఠా భూముల కబ్జాలకు పావుగా వాడుకుందని మంత్రి సవిత మండిపడ్డారు. కడపలోని గూడూరు వద్ద ఉన్న కేసీ కెనాల్‌ను మూసి వేసి, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా లే అవుట్ వేశారన్నారు. ఈ లే అవుట్‌ను ప్లాట్లగా విభజించి, పెద్ద దస్తగిరి చేత విక్రయించారన్నారు. అదే వెంచర్‌లో ఓ భారీ ప్యాలెస్‌ను నిర్మించి, జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని పెద్ద దస్తగిరి నిర్ణయించాడన్నారు. ఆయనను హత్య చేసి, ఆ శవాన్నికుటుంబ సభ్యులకు వైసీపీ బ్యాచ్ రిటర్న్ గిఫ్ట్‌గా ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు చేసిన భూ కబ్జాలు, దోపిడీల వల్లే రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లు కిక్కిరిసిపోతున్నాయని, ప్రతి సమస్యనూ తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని మంత్రి సవిత తెలిపారు.



**తాళిబొట్లు తెంపి ఏం సాధిస్తావ్..?**

జగన్ అధికార దాహానికి, అక్రమాస్తుల ఆర్జనకు నమ్ముకున్న వారిని బలి తీసుకోవడం వైసీపీకి, జగన్‌కు అలవాటుగా మారిందని మంత్రి సవిత విమర్శించారు. ముఖ్యమంత్రి కుర్చీ కోసం జగన్ రెడ్డి తండ్రి మరణాన్ని ఎలా వాడుకున్నారో అందరికి తెలుసన్నారు. గొడ్డలి వేటుకు బలైన బాబాయిని రాజకీయ బలి పశువుగా ఎలా చేశారో అందరూ చూశారన్నారు. డబ్బు కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరైనా బలి పెట్టే నీచ చరిత్ర జగన్మోహన్ రెడ్డిదన్నారు. నాడు పిన్నమ్మ సౌభాగ్యాన్ని హరించిన జగన్, నేడు నమ్ముకున్న దస్తగిరిని చంపించి ఆయన సతీమణి రవణమ్మ జీవితాన్ని నాశనం చేశారన్నారు. మహిళల తాలిబొట్లు తెంపి, ఏం సాధించగలవని ప్రశ్నించారు. మహిళల జీవితాలతో ఆడుకోవటం జగన్మోహన్ రెడ్డికి సరికాదని మంత్రి సవిత హితవు పలికారు.

**జగన్ కుట్రలకు బలయ్యేది ఎస్సీలు, ఎస్టీలు, బీసీలే...**

పెద్ద దస్తగిరిని చంపింది వైసీపీ రౌడీలని, చంపించింది వైసీపీ నాయకుడని, చంపడానికి స్క్రిప్ట్ ఇచ్చింది తాడేపల్లి ప్యాలస్ అని మంత్రి సవిత ఆరోపించారు. నమ్మిన వారినే బలి తీసుకోవటం జగన్మోహన్ రెడ్డి నైజమన్నారు. జగన్ రెడ్డి కుట్రలకు ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు బలయ్యారన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో సింగయ్యను కారుతో తొక్కించడం, బీసీ బిడ్డ అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టడం, నేడు పెద్ద దస్తగిరిని హత్య చేయడం ఇలా వైసీపీ హత్యా రాజకీయాలకు బడుగు, బలహీన వర్గాల ప్రజలు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద దస్తగిరి నివాసంలో 150కి పైగా ఆస్తి పత్రాలు బయటపడ్డాయని, వాటిలో వైసీపీ పెద్దల పేర్లతో కొన్ని పత్రాలు లభ్యమయ్యాయని తెలిపారు. వైసీపీ పార్టీ గుర్తు ఇప్పుడు గొడ్డలిగా మారిపోయిందని మంత్రి సవిత అన్నారు.

**పెద్ద దస్తగిరి కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదు..?**

శవరాజకీయాలు చేయడంలో ఆరితేరిపోయిన జగన్‌కు పెద్ద దస్తగిరి హత్య గుర్తుకు రాకపోవడం విచిత్రమని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. సొంత పార్టీ కార్యకర్త హత్యకు గురైనా స్పందించకపోవడం గమనార్హమన్నారు. కడప జిల్లాలో పర్యటిస్తున్న జగన్ ... పెద్ద దస్తగిరి కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. 'నిన్ను నమ్మితే...మా ఆయన ప్రాణాలు తీస్తావా..?' అని పెద్ద దస్తగిరి భార్య రవణమ్మ నిలదీస్తే... జవాబు చెప్పుకోలేకే జగన్ అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. వైసీపీ సిద్ధాంతమే రప్పా రప్పా నరుకుతాం...చంపుతాం...అని అన్నారు. పాము పడగ కింద వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాజకీయాలు చేస్తున్నారని, వారంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత హెచ్చరించారు.

**నేరస్తులు ఎంతటి వారైనా పట్టుకుని తీరుతాం**

డ్రైవర్ సుబ్రహ్మణ్యం కేసులో ఎమ్మెల్సీ అనంత బాబు ఏ విధంగా సాక్షులను బెదిరిస్తున్నారో రాష్ట్రమంతా చూస్తోందని మంత్రి సవిత తెలిపారు. వివేకా హత్య కేసులోనూ సాక్షులను బెదిరించి, అవసరమైతే రపరప నరుకుతాం అని హెచ్చరించిన చరిత్ర వైసీపీదన్నారు. దస్తగిరి హత్యను కూడా ఏదో ఆస్తుల తగాదాగా చిత్రీకరించి డైవర్ట్ చేయాలని చూశారు. కానీ తమ ప్రభుత్వం, పోలీసులు చాలా అప్రమత్తంగా ఉన్నారు. నేరస్తులు ఎక్కడ దాక్కున్నా, ఎవరి వెనుక ఉన్నా పట్టుకుని తీరుతామని స్పష్టం చేశారు. జగన్ రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందన్నారు. చట్టం తన పని తాను చేస్తోందని, దస్తగిరి మరణానికి కారణమైన 11 మందిని ఇప్పటికే అరెస్ట్ చేశామని తెలిపారు. నిత్యానంద రెడ్డితో పాటు ఈ కుట్రలో భాగమైన ప్రతి ఒక్కరినీ, వారు ఎంతటి బడా నాయకులైనా సరే, కచ్చితంగా లోపల వేస్తామని హెచ్చరించారు. బీసీల రక్తం తాగే ఈ వైసీపీ రాక్షస రాజకీయాన్ని అంతం చేసే వరకు విశ్రమించేది లేదని మంత్రి హెచ్చరించారు.

# నేడు ముఖ్యమంత్రి రాంబిల్లి పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి తనిఖీ : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్











**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** ఈనెల 23న ముఖ్యమంత్రి రాంబిల్లి పర్యటన సందర్భంగా సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలతో సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్, డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ తుహిన్ సిన్హా, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వర రావులతో కలిసి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరయ్యే ప్రజల రవాణా కోసం ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా సుమారు 300 బస్సులు ఏర్పాటు చేయగా, ఇవి ఉదయం 7 గంటల నుంచే వివిధ పాయింట్ల నుంచి బయలుదేరనున్నాయని తెలిపారు. ముందు రోజే బస్సులను నిర్ణయించిన ప్రదేశాల్లో సిద్ధంగా ఉంచనున్నట్లు తెలిపారు.

సభ ప్రాంగణంలో పూర్తి ఎయిర్ కండిషనింగ్ సదు పాయం కల్పించడంతో పాటు, 150 టాయిలెట్లు ఏర్పాటు చేసి నట్లు చెప్పారు. గ్యాలరీల్లో తాగునీరు, భోజనం, మజ్జిగ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బందిని విస్తృతంగా మొబిలైజ్ చేసి, ప్రతి విభాగానికి ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లైస్ శాఖ ద్వారా ప్యాక్డ్ ఫుడ్ మరియు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ మాట్లాడుతూ బస్సుల్లోనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని, వాలంటీర్లను నియమించి క్రమశిక్షణ పాటించేలా చూస్తున్నామని తెలిపారు.

# చిగురిస్తున్న సాగు ఆశలు

## - 'జలధార'తో మారనున్న గంగచోళ్లపెంట రూపురేఖలు







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** దశాబ్దాల నీటి కష్టాలకు చెక్ పడనుంది. ఎండిపోయిన భూముల్లో మళ్లీ పచ్చదనం పరుచుకోనుంది. గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామంలో అమలవుతున్న 'జలధార' పనులు స్థానిక రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం మట్టి పనులుగా కాకుండా, తమ భవిష్యత్తును మార్చే అభివృద్ధి యజ్ఞంగా రైతులు ఈ పనులను భావిస్తున్నారు.

**సమిష్టి కృషితో సాగు నీటి సంకల్పం:**

బోనివాని చెరువు వద్ద మంగళవారం నాటికి 207 మంది వేతన దారులు ఉత్సాహంగా పనుల్లో నిమగ్నమయ్యారు. పూడికతీత పనులతో చెరువు గర్భం పెరుగుతుంటే, తమ కష్టాలు తీరుతాయన్న నమ్మకం వారి కళ్లలో కనిపిస్తోంది. సుమారు 19.65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేయడం ద్వారా 400 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుంది. గతంలో వర్షం కోసం ఆకాశం వైపు చూసేవాళ్లం. ఇప్పుడు చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుండటంతో మా పొలాలకు భరోసా దొరికినట్లయింది," అని స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అనుసంధానంతో జలకళ :**

ఈ ప్రాజెక్టులోని ప్రధాన ఆకర్షణ చెరువుల అనుసంధానం. చంపావతి నది నుంచి ప్రవహించే జలాలు క్రమపద్ధతిలో సాగు భూములను తడిపేలా ప్రణాళిక రూపొందించారు. చంపావతి నది - బద్ది చెరువు (38 ఎకరాలు - 300 ఎకరాల సాగు) బద్ది చెరువు - బోనివాని చెరువు (19.65 ఎకరాలు - 400 ఎకరాల సాగు) బోనివాని చెరువు - పోతలపూడి చెరువు (19.5 ఎకరాలు - 115 ఎకరాల సాగు)..ఇలా ఈ గొలుసుకట్టు చెరువుల వ్యవస్థ ద్వారా నీటి వృధా అరికట్టడమే కాకుండా, భూగర్భ జల మట్టం పెరిగి చుట్టుపక్కల బావుల్లో కూడా జలకళ రానుంది.

**రైతు ఆదాయానికి 'జలధార' భరోసా:**

బోనివాని చెరువు అభివృద్ధి ద్వారా 160 రైతు కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండనున్నాయి. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా, నీటి లభ్యత పెరగడంతో రైతులు విభిన్న పంటల వైపు మొగ్గు చూపుతున్నారు.

**అపరాల సాగు:**

వరి కోత అనంతరం తేమ ఉండటంతో పప్పు ధాన్యాల సాగుకు అవకాశం పెరిగింది. మొక్కజొన్న సాగు: అదనంగా 20 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ముగింపు పూడికతీత ద్వారా వచ్చిన మట్టితో చెరువు కట్టలను బలోపేతం చేస్తుండటంతో, రాబోయే వర్షాకాలం నాటికి బోనివాని చెరువు నిండు కుండలా మారనుంది. నీటి కొరతతో కుదేలైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు 'జలధార' ఒక సంజీవనిలా మారి, గజపతినగరం మండల వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చబోతోంది.

# ఎవరు ఔనన్నా కాదన్నా.. కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం: హరీశ్ రావు




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు.

**హరీశ్‌రావు ట్వీట్...**

'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు సంస్థ తరఫున ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్ హేమకుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ కాలేజీలతో పోటీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను, వారి ఉత్తమ ఫలితాలకు దోహద పడిన బోధనా సిబ్బందిని అభినందించారు. ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించినప్పుడు వారు మరింత స్ఫూర్తి పొంది భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు షరీఫ్, నారాయణ, శ్రీను, అంజయ్య, కాలేజీ ప్రిన్సిపాల్ లలిత పాల్గొన్నారు.

# నాదెండ్ల భాస్కర్‌రావు వివరాలు



నాదెండ్ల భాస్కర్ రావు 1935 జూన్ 23న పిచ్చయ్య, శ్రీమతి వెంకాయమ్మ దంపతులకు తెనాలి డివిజన్, కొల్లూరు మండలం, దోసేపూడిలో జన్మించారు. బాల్యం మొత్తం అక్కడే సాగింది. వ్యవసాయ కుటంబంలో పుట్టిన భాస్కరరావు చదువుల్లో రాణించారు. దేశ భక్తి భావాలు కలిగిన వ్యక్తి కావడంతో చదువుకునే రోజుల్లోనే రాజకీయ ప్రభావం ఆయనపై ఎక్కువగా ఉండేది. సమకాలీన రాజకీయాలు, సమాజంలోని పరిస్థితుల పట్ల ఆయన ఎప్పటికప్పుడు స్పందించేవారు. హైదరాబాద్‌లో బీఏ పూర్తి చేసి అక్కడే లా ఈవెనింగ్ కాలేజీలో బి.ఏ.ఎల్.ఎల్.బి, ఎల్ఎస్ జీడీ పట్టాలు పొంది న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. 1959లో శ్రీమతి లలితని వివాహం చేసుకున్నారు. ఈయనకు ఇద్దరు కుమారులు శ్రీ భాస్కర్ రావు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రముఖ న్యాయవాదిగా పేరు గడించారు.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి...**

న్యాయవాదిగా బిజీగా ఉంటూనే రాజకీయాల్లోకి శ్రీ భాస్కరరావు గారు అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ఇందిరా కాంగ్రెస్‌లో ఏపీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. 1978 నుంచి 1989 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. 1984లో ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 16వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా సేవలు అందించారు. శ్రీ మర్రి చెన్నారెడ్డి గారు, శ్రీ టి.అంజయ్య గారి హయాంలో మంత్రి వర్గంలో పని చేశారు. 1998లో ఖమ్మం నియోజకవర్గం నుంచి 12వ లోక్‌సభకు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆంధ్రుల ఆత్మాభిమానం నినాదంతో 1982 మార్చి 29న శ్రీ నందమూరి తారక రామారావు గారు తెలుగు దేశం పార్టీని స్థాపించారు. 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ హయాంలో శ్రీ భాస్కర్ రావు గారు ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో జరిగిన పరిణామాలతో రాజకీయాలను కొంత దూరం నిలిచారు. శ్రీ భాస్కరరావు గారికి ఇద్దరు కుమారులు. శ్రీ మురళీ, శ్రీ మనోహర్‌లు. చిన్న కుమారుడు శ్రీ నాదెండ్ల మనోహర్ గారు తెనాలి నియోజకవర్గం నుంచి 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్‌గా, 2011 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చివరి శాసనసభాపతిగా సేవలు అందించారు. 2018లో శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు స్థాపించిన జనసేన పార్టీలో శ్రీ నాదెండ్ల మనోహర్ గారు చేరారు. పార్టీ పీఏసీ ఛైర్మన్‌గా పార్టీ కోసం విశేష సేవలు అందించారు. 2024లో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ తరపున పోటీ చేసి గెలిచి, ప్రస్తుతం రాష్ట్ర పౌరసరఫరాలు ఆహారం, వినియోగదారుల వ్యవహారాల మంత్రిగా ఉన్నారు. ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్నారు.

# పాలిసెట్ పరీక్షకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

## - అధికారుల సమావేశంలో డీఆర్వో విజయ్ కుమార్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఏపీ పాలిసెట్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 25న శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న పాలిసెట్-2026 ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. పరీక్షను నెల్లూరు, ఆత్మకూరు, కావలి, గూడూరు కో-ఆర్డినేటింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10.00 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరి అని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీరు వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష సమయంలో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని డిఆర్ఓ తెలిపారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఊటుకూరు పెద్దపాళెం కాపులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సన్మానం

**- కాపులుగా ఎంపికైన మత్స్యకార పెద్దలకు అభినందనలు - మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, అంకితభావంతో కృషి చేయాలి - మత్స్యకారులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాను : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు /విడవలూరు, (రాజధాని వార్తలు):** మత్స్యకార గ్రామాల్లో అనాదిగా వస్తున్న కాపు వ్యవస్థలో భాగంగా మండల పరిధిలోని ఊటుకూరు పెద్దపాళెం మత్స్యకార గ్రామ పెద్దలలు తమ నూతన నాయక త్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాలువాతో ఘనంగా సత్కారం చేసి అభినందనలు తెలిపారు.గ్రామ మత్స్యకార సంఘం పెద్ద కాపుగా ఆడారి, కనకయ్య, నడిం కాపుగా కొండూరు ఏడుకొం డలు, చిన్న కాపుగా కొండూరు అమరేంద్ర, మరియు కార్యదర్శిగా పాపారావులను ఏకగ్రీవంగా గ్రామం ఎంపిక చేసింది. వీరితో పాటు మరో ఆరుగురుగ్రామ మత్స్యకార గ్రామ పెద్దలుగా గ్రామం సభ్యులు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మత్స్యకార నాయకులు నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కాపులు మరియు మత్స్యకార పెద్దలకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి మత్స్యకార పెద్దలకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నూతన కార్య వర్గం మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. మత్స్యకారులకు ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా తాను కృషి చేస్తానని మత్స్యకార నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో కాపులతో పాటు పలువురు మత్స్యకార నాయకులు మరియు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# ఊటుకూరు నాగార్జున్‌ని వైస్సార్సీపీ మహిళా నాయకురాలు సంపూర్ణమ్మ పరామర్శ



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రి మరియు వైఎస్సార్ సీపీ అధినేత వైయస్ జగన్మోహనరెడ్డి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, ఇటీవల పర్యటన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న 13వ డివిజన్ కార్పొరేటర్ మరియు నెల్లూరు జిల్లా వైఎస్ఆర్సీపీ యువజన విభాగం అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున్‌కు ప్రమా దవశాత్తు కాలికి గాయం అవ్వగా నెల్లూరు అపోలో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకొంటు న్నారు. ఈ సందర్భంగా నాగార్జున్‌ను వారి నివాసంలో జిల్లా మహిళా వైసీపీ నాయకురాలు వడ్డే సంపూర్ణమ్మ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నగర క్రిస్టియన్ మైనారిటీ అధ్య క్షురాలు సిహెచ్ సులోచన మేరి గ్రీవెన్స్ సెల్ జనరల్ సెక్రెటరీ ఏ సుప్రియలు ఉన్నారు.

# భారత ఉప రాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలో గౌరవ భారత ఉపరాష్ట్రపతి, సిపి రాధాకృష్ణను ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తెలుగు జాతి ఆడబిడ్డ ఆంధ్రప్రదేశ్ హోమ్ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, తదితర మహిళ శాసనసభ్యులు మరియు మంత్రివర్యులు పార్లమెంటరీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ ఉపరాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పరస్పర శుభాకాంక్షలు తెలియజేసు కుంటూ గౌరవ ఉపరాష్ట్రపతిని కలవడం చాలా ఆనందంగా ఉందని ప్రముఖులు పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సామాజిక న్యాయం మరియు పేద ప్రజల సంక్షేమంపై చర్చలు జరిపినట్లు సమాచారం.

# వెలిగొండ ప్రాజెక్ట్ పురోగతి పైన మే 4న సమావేశం కానున్న వైసీపీ

**వెలిగొండ, (రాజధాని వార్తలు):** వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "రాయలసీమ ఎత్తిపోతల పథకం మరియు వెలిగొండ ప్రాజెక్ట్ పనుల పురోగతి మరియు కృష్ణా జలాల పంపిణీ" పై మే 4వ తేది (సోమవారం)న మార్కాపురంలోని సౌజన్య ఫంక్షన్ హాల్ నందు జరుగు సమావేశం ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ అన్నా రాంబాబు, అన్నా కృష్ణ చైతన్య, నియోజకవర్గ ముఖ్య నాయకులు, వైసీపీ శ్రేణులు ఉన్నారు.



# కోవ్వూరు అన్నా క్యాంటీన్ ఏర్పాటుపై పలువురు హర్షం

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు చరిత్రలో తొలిసారిగా టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక కృషితో కోవూరు తాలూకా ప్రాంగణంలో అన్నా క్యాంటీన్ ఏర్పాటుతో పలువురు హర్షము వ్యక్తం చేసారు. కోవూరు పైన దృష్టి పెట్టి ఆకలిని తీర్చే అమ్మగా ఎమ్మెల్యేను కొనియాడారు. ప్రతి పనిలో చిత్తశుద్ధి చేసే ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఎక్కువ మార్కులు వస్తున్నాయి అని చెప్పక తప్పదు. దీంతో తాలూకా కార్యాలయంకు కోర్టులకు వచ్చే సుదురా ప్రాంత బాధితులకు అన్నా క్యాంటీన్ ద్వారా ఆకలిని తీరుస్తుందని అభి ప్రాయం వ్యక్తం చేసారు. ప్రవేట్ హోటల్‌లలో సింగిల్ భోజనం 60 రూపాయలు పెట్టుకోవలసిన పరిస్థితి ఉండేది. 5 రూపాయ లకే అన్నా క్యాంటేన్‌లో నాణ్యమైన భోజనం అందుతున్న క్రమంలో భోజనప్రియులకు ఇక్కడ క్యాంటీన్ ఒక వరమని అంటున్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం సకాల ములో అందుబాటులో ఉండడం తక్కువ సమయములోనే పూర్తి కావడంలాంటి చర్యలు కూడా జరుగుతుంది. భోజన టోకెన్లు క్యాంటీన్ పర్యవేక్షకులు ఇవ్వడమే ఆలస్యం. త్వరితగతిన భోజనం కార్యక్రమం పూర్తి అవుతోంది. ఎన్నడూ లేని విధంగా కోవూరులో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చొరవతో ప్రజలకు ఆకలిని తీర్చే క్యాంటీన్ ఉందని చర్చిస్తున్నారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే ప్రశాంతి తీసుకొని ఇక్కడ అన్నా క్యాంటీన్ కొరకు అనుమతులు తీసుకొని వచ్చి ఇటీవలే కోవూరులో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎంపీ వేమిరెడ్డి ద్వారా ప్రారంభం చెయ్యడం పట్ల కోవూరు నియో జకవర్గం ప్రజలు పుణ్యదంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.



# శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**కోట, (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలోని విద్యానగర్లో శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్‌నందు ఆ పాఠశాల కరస్పాం డెంట్ నీలం సురేందర్ రెడ్డి ఎల్కేజీ మరియు యూకేజీ విద్యార్థుల కు గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ షేక్ జిలాని భాష పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం చైర్మన్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గత 15 సంవత్సరాలుగా గ్రాడ్యుయేషన్ ప్రోగ్రాం ను ఘనంగా నిర్వహిస్తున్నామని అదే విధంగా 10వ తరగతి ఫలితాలలో తమ పాఠశాల నూరు శాతం ఫలితాలను విద్యార్థు లకు అందిస్తుందని ఎల్కేజీ నుంచి పదవ తరగతి వరకు విద్యా ర్థులు క్రమశిక్షణ అంకితభావంతో శ్రద్ధతో చదివే విధంగా తమ పాఠశాల సిబ్బంది కృషి చేస్తున్నందుకు వారికి ప్రత్యేక ధన్యవా దాలు తెలియజేశారు అనంతరం విద్యార్థులు సినీ గీతాలకు నృత్య ప్రదర్శన చేసి అలరించారు ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ షేక్ జిలాని భాష, శ్రీనివాస విద్యా సంస్థల చైర్మన్ మరియు హ్యూమన్ రైట్స్ వైస్ చైర్మన్ నీలం సురేందర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గిరిజనులు సాగు చేస్తున్న భూములు గిరిజనులకి ఇవ్వాలి

**తిరుపతి, (రాజధాని వార్తలు):** సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాలెం మండలం చిన్న పాండూరు పంచాయతీలోని సోత్రియ భూములను కాపాడాలని ప్రభుత్వాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని సిపిఐ ఆధ్వర్యంలో మంగళ వారం రోడ్డుపైకొచ్చి ఆందోళన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆమ్బాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ సోత్రీయ భూములను కాపాడడంలో రెవెన్యూ అధికారులు విఫలం చెందారని అందువల్ల ఈ భూముల విషయంగా గిరిజనులు స్థానికేతరుల మధ్య వివాదాల ఏర్పడుతూ శాంతిభద్రతల ఉత్తన్నమయ్యే పరిస్థితి ఉందని సంబంధిత రెవెన్యూ అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడంలేదని చిన్ని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోత్రియ భూములు పక్కనే శ్రీ సిటీ హీరో మోటార్స్. అపోలో టైర్స్‌లాంటి భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడం వలన ఆ ప్రాంతంలో భూములు విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో డబ్బు రాజకీయాలు అండదండలు ఉన్న కొంత మంది వ్యక్తులు గిరిజనులను భయపెట్టి దౌర్జన్యంగా కొంత డబ్బులు ముట్టజెప్పి ఆ భూములను లాక్కొని పెద్ద పెద్ద భవనాలు నిర్మించి బాడుగులకు ఇవ్వడం తద్వారా లక్షలాది రూపాయలు అర్జించడం జరుగుతా ఉంది ఇదే సందర్భంలో ఇటీవల గిరిజ నులు సాగు చేసుకున్న భూములపై కొంతమంది ఫెన్సింగ్ రా ళ్లు నాటి మట్టి తోలి ఇవన్నీ మా భూములన్నీ గిరిజనులు అమ్మా రని బహిరంగ చెబుతున్న రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా మీనమేషాలు చేయడం ఏమాత్రం మంచిది కాదని ఈ సోత్రియా భూములపై సమగ్రంగా సర్వే చేసి ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చిన్ని రాజు తెలియజేశారు. అయితే రెవెన్యూ అధికారులే ఈ భూము లను లీజులు ఇవ్వడం ఈ భూములలో వారే ఇల్లు కట్టుకోవడం జరుగుతూ ఉందని అందువల్ల కబ్జాకోరులకు ఏమాత్రం భయం లేకుండా పోయిందని ఈ భూమి నాది అంటే నాది అని ప్రతి రోజు వివాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పుడు కూడా చోత్రియ భూముల్లో గుమ్మడి. దర్బూస పుచ్చ తదితర పంటలు స్థానిక ఇతరలు పంటలు పండిస్తూ ఉన్నారని అధికారులకు తెలియజేసిన గిరిజనుల బెదిరిస్తున్నారు. తప్ప స్థానిక ఇతరులు అనర్హులను ఏమాత్రం కట్టడి చేయడం లేదని అందువల్ల ఈ ప్రాంతంలో తీవ్ర మైన సమస్యలు ఏర్పడుతున్నాయని గిరిజనులు తెలియజేశారు. గిరిజనులకు ఇచ్చిన ఇండ్ల పట్టాలు సర్వే చేసి అన్యాక్రాంతమైన భూమిలేవి పట్టా భూములేవి నిగ్గు తేల్చాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని వెంటనే సోత్రియా భూముల విషయమై అధికారులు కల్పించుకుని గిరిజనుల సాగుకు భూములు ఇచ్చే గిరిజనులకు రక్షణ కల్పించకపోతే తాసిల్దార్ ఆఫీస్ వద్ద నిరావధిక నిరాహారదీక్ష కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని సిపిఐ చిన్ని రాజా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి ధనుంజయ శెట్టి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెల్లమ్మ రామకృష్ణయ్య మారయ్య శారదమ్మ ముత్యాలమ్మ అలగల గోవిందస్వామి గిరిజనులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.




# పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని పూజలు



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆంజనేయ స్వామి గుడిలో పేట బ్రదర్స్ మిత్ర బృందం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. రాష్ట్రంలోని ప్రజలు ఒక కుటుంబ స్థాయి నుంచి, గ్రామం, మండలం, జిల్లా స్థాయి వరకు సమస్య ఏదైనా సరే కష్టాల్లో ఉన్నామని తెలియపరిచిన వెంటనే వారి యొక్క బాధలను వినడమే కాకుండా, తక్షణమే స్పందించి వారిని ఆదుకునే వ్యక్తి పవన్ కళ్యాణ్, అటువంటి గొప్ప వ్యక్తి నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి దేవుడిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఎన్నికల రాజకీయాల్లో భగ్నమైన మహిళ కల

'ఈ బిల్లు పాసవుతుందంటారా.. మా బాస్ ఒకటికి రెండుసార్లు అడుగుతున్నారు' అని ఒక మిత్రపక్ష ఎంపీ గతవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూను అడిగారు. 'ఆ అనుమానం మీకు ఎందుకు వస్తోంది? నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండగా ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ అనుకున్నది సాధించి తీరుతారు. తెరవెనుక చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనేక మంది మన వైపు మొగ్గు చూపుతారు. చూస్తూ ఉండండి' అని ఆయన సదరు నేతకు చెప్పారు. 'అంతే కాదు, నేనే మీ బాస్‌తో మాట్లాడతా' అని స్వయంగా తానే ఫోన్ చేసి 'బిల్లు పాసవడానికి ఎలాంటి అడ్డంకులు లేవు' అని చెప్పారు. దీంతో ఆ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మహిళలను పిలిచి సంబరాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అసలు బిల్లు ఆమోదం పొందదేమోనన్న అభిప్రాయం ప్రధానమంత్రికి కూడా ఉన్నట్లు కనిపించలేదు. ఏప్రిల్ రెండో వారం నుంచే దేశవ్యాప్తంగా మహిళలను ఢిల్లీకి రప్పించడం మొదలు పెట్టారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ అన్ని రాష్ట్రాల అధ్యక్షుల్ని, ముఖ్యమైన నేతల్ని పిలిపించి రాష్ట్రాల్లో మహిళా సదస్సులు నిర్వహించాలని, మహిళా రిజర్వేషన్‌పై విలేఖరుల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విజ్ఞాన్ భవన్‌లో మహిళలతో ఒక పెద్ద సదస్సు నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. తమ పార్టీకి చెందిన మహిళల్లో ముఖ్య నేతలందర్నీ కేంద్ర కార్యాలయానికి రప్పించి ప్రజల్లోకి వెళ్లేందుకు, మీడియాతో మాట్లాడేందుకు శిక్షణ నిప్పించారు. ఏఏ రాష్ట్రాలలో ఎన్నెన్ని సీట్లు పెరుగుతాయో డాక్యుమెంట్లు తయారు చేసి పంపిణీ చేశారు. చివరకు లోక్‌సభ గ్యాలరీలను మహిళా ప్రజాప్రతినిధులతో నింపేశారు. దేశ రాజధాని, పార్లమెంట్ ప్రాంగణం అంతా మహిళలతో కళకళలాడిపోయింది. చాలామంది మహిళలు ఇక తాము కూడా త్వరలో సభలో ప్రవేశిస్తామని కలలు కన్నారు. కొందరు తమకు సీట్లను కూడా నిర్ణయించుకున్నారు. మహిళా రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొంది ఉంటే దేశవ్యాప్తంగా మహిళల్లో పెద్ద ఊపు తెప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ ఎన్ని సన్నాహాలు చేసి ఉండేవో! కానీ, ఏప్రిల్ 16న పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే ప్రతిపక్షాలు సంఘటితంగా ఉన్నట్లు స్పష్టమైంది. ప్రతిపక్షాలను తమ వైపునకు తిప్పుకునేందుకు, గైర్హాజరు చేయించేందుకు తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి. 'ఈ బిల్లు వీగిపోతే ప్రతిపక్షాలను మహిళలు క్షమించరు' అని మోదీ హెచ్చరించాల్సి వచ్చింది. అసలు ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష ఎంపీలు ఈ సమావేశాలకు రాగలరా అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిజానికి పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఈసారి గతంలో ఎన్నడూ లేనంత గట్టి పోటీని ఎదుర్కొంటున్నారు. ఆ పార్టీ ఎంపీలంతా ప్రచారంలో మునిగి ఉన్నారు. ప్రతిపక్షాలు ఎంత సంఘటితంగా ఉండాలనుకున్నా ఓటింగ్‌కు ఏడుగురు తృణమూల్ ఎంపీలు గైర్హాజరు కావల్సి వచ్చింది. అయినప్పటికీ లోక్‌సభలో రెండింట మూడోవంతు మెజారిటీకి, ఎన్డీఏ సంఖ్యా బలానికి ఎంతో తేడా ఉండడంతో రాజ్యాంగ సవరణ వీగిపోక తప్పలేదు. కర్ణుడి చావుకు లక్ష కారణాలున్నట్లు ఈ బిల్లు వీగిపోవడానికి కూడా ఎన్నో కారణాలున్నాయి. ఎంతో చరిత్రాత్మకమైన ఘట్టం అనుకున్నది ఇలా చివరకు ఒక ప్రహసనంగా ఎందుకు తేలిపోవల్సి వచ్చింది? 2023లో మహిళా రిజర్వేషన్ కల్పించేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించినప్పుడు ఈ బిల్లును ఎందుకు వ్యతిరేకించాయి? అసలు ఆ రాజ్యాంగ సవరణ బిల్లును మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఒకవేళ మార్చాలనుకుంటే దానిపై కూడా ఏకాభిప్రాయం సాధించేందుకు ఎందుకు ప్రయత్నాలు జరగలేదు? 2029లో మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ఇంకా మూడేళ్ల సమయం ఉన్నది. అందుకోసం బడ్జెట్ సమావేశాలనే పొడిగించి అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది? మోదీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బెంగాల్ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో మహిళలను తమ వైపునకు తిప్పుకునేందుకు మహిళా రిజర్వేషన్ పేరుతో పావులు కదిపారా? అటువంటప్పుడు ఆ రిజర్వేషన్‌కూ సీట్ల పెంపునకూ ముడిపెట్టి రాజ్యాంగ సవరణ బిల్లును తేవాల్సిన అవసరం ఏమిటి? ఉత్తరప్రదేశ్‌లో సీట్ల పెంపు వల్ల సమాజ్‌వాది పార్టీకి కూడా ప్రయోజనం కనుక ఆ పార్టీని తమ వైపునకు తిప్పుకునేందుకే ఈ మేరకు ప్రభుత్వం వ్యూహం పన్నిందా? డీలిమిటేషన్ బిల్లులో జనాభా ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పడం, 50శాతం సీట్ల పెంపు ప్రతిపాదన లేకపోవడం, ఉత్తరాది - దక్షిణాదికి మధ్య వ్యత్యాసాలు పెరుగుతాయన్న చర్చ ప్రబలడం అనుమానాలకు దారి తీస్తుందని ప్రభుత్వం ముందుగా ఊహించలేదా? చివరి నిమిషంలో బిల్లును మారుస్తామని హోంమంత్రి అమిత్ షా చెప్పినా ప్రతిపక్షాలు ఒప్పుకోలేదంటే అధికార పక్షానికీ, విపక్షాలకూ మధ్య ఒకర్నొకరు విశ్వసించలేని శత్రుభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. 2011 జనగణనను ఆధారంగా తీసుకోవడం ఓబీసీలను విస్మరించేందుకే అన్న చర్చ జరుగుతుందని కూడా ప్రభుత్వం ఊహించినట్లు కనపడలేదు. మన దేశంలో తక్షణ ప్రయోజనాలకోసం ఆడే రాజకీయాలు, ప్రచారార్భాటాల వల్ల ఒక్కోసారి మహిళలకు ప్రాతినిధ్యం వంటి అవసరమైన నిర్ణయాలు కూడా వెనక్కి వెళ్లక తప్పదు. పార్లమెంట్ సమావేశాలు ముగిసినప్పటికీ మహిళా రిజర్వేషన్‌పై అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం ఆగలేదు. బిల్లు వీగిపోవడానికి ప్రతిపక్షాలను తీవ్రంగా విమర్శిస్తూ ప్రధాని మోదీ ఏకంగా దూరదర్శన్‌లో ప్రసంగించారు.

# అధికారంలో ఉన్నా, లేకున్నా ఆగని గుడ్ మార్నింగ్ గంకల

**- పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - 48వ వార్డులో వేసవి ఎద్దడికి నివారణ చర్యలు చేపట్టిన గంకల కవిత అప్పారావు యాదవ్ - బాపూజీ నగర్‌లో నూతన చేతి బోరు ఏర్పాటు పనులు ప్రారంభించిన గంకల - భూగర్భజలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని వార్డు ప్రజలకు పిలుపు - వడ దెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్త వహించాలి - ప్రజలు శక్తి మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చిన గంకల**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వేసవి తరుణంలో నగరంలో రోజురోజుకి పెరిగిపోతున్న ఎండల నేపథ్యంలో జీవీ ఎంసీ 48వ వార్డు కొండ ప్రాంతంలో వేసవి ఎద్దడికి జీవీఎంసీ 48వ వార్డు మాజీ కార్పొరేటర్, మాజీ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్,మాజీ జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ నివారణ చర్యలు చేపడుతున్నారు. 48వ వార్డు బాపూజీ నగర్‌లో చేతి బోరు లేక ఇబ్బందులు పడుతున్నారని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో తెలుసుకొని జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి నూతన బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు వార్డులో గల బాపూజీ నగర్‌లో పర్యటించి చేతి బోరు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య లేకుండా బోరు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.వేసవి తరుణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వార్డులో బోరు ఏర్పాటు చేయాలనీ గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో పిర్యాదు అందిందని పిర్యాదుపై జీవీఎంసీ కౌన్సిల్‌లో చర్చించి నిధులు కేటాయించి బోరు నిర్మాణం చేసినట్టు తెలిపారు. బాపూజీ నగర్‌లో సామాజిక భవనం నిర్మాణ దశలో ఉండడంతో ఇక్కడ చేతి బోరింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ సామాజిక భవనం,చేతిబోరు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజలకు శుభకార్యాలకు, మంచినీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందన్నారు. ప్రజలు వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని, ప్రజలు శక్తి మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటి బయట మూగ జీవాలకు తొట్టెలలో నీరు ఏర్పాటు చేయాలనీ పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో వార్డులో మరిన్ని చోట్ల చేతి బోరు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వార్డు అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించడం జరుగుతుందని వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల పేర్కొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల అడుగులు

## - మండల వ్యవసాయ శాఖ అధికారి గౌరీ

**వరదయ్యపాలెం, (రాజధాని వార్తలు):** ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల అడుగులు వేస్తున్నారని మండల వ్యవసాయిశాఖ అధికారి గౌరీ అన్నారు. మంగళవారం నవ(9) సార్వత్రిక సూత్రాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం వరదయ్యపాలెంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రారంభమయింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను ప్రేరేపిస్తోందన్నారు. ఈ క్రమంలో నవ సార్వత్రిక సూత్రాలు రైతులకు కీలకంగా మారుతున్నాయని మండల వ్యవసాయిశాఖ అధికారి గౌరీ తెలిపారు. రైతులు భూమి సారాన్ని కాపాడటం, రసాయనాల వినియోగాన్ని తగ్గించడం, సహజ వనరులను సమర్థవంతంగా ఉపయోగించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది, శిక్షణ బృందం, రైతులకు అందించవలసిన ప్రాయోగిక సూచనలు, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆదాయం పెంపు సాధ్యమని వివరించారు. సందేహాలను నివృత్తి



చేసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపు, తక్కువ ఖర్చుతో అధిక లాభాల సాధన, భూమి సార సంరక్షణపై దృష్టి, రసాయనాల వినియోగం తగ్గింపు ముఖ్యమైన అంశాలు తెలియజేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం రైతులకు ఉత్తమ ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఆరోగ్య కరమైన ఆహారం, సుస్థిర పర్యావరణం కోసం ఈ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ చర్యలకు రైతుల సహకారం లభిస్తే వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు సాధ్యమవుతాయన్నారు. రైతు బలపడితే, దేశం బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలం వ్యవసాయాధిరి గౌరీ, పి ఏ సి ఎస్ చైర్మన్ నందకిశోర్ రెడ్డి, డివిఎంసి మెంబెర్ గుత్తి త్యాగరాజు రైతులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేచే 'బడి పిలుస్తోంది' కరపత్రాలు ఆవిష్కరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న అత్యాధునిక సౌకర్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అడ్మిషన్ల శాతాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పి.ఎం.శ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన "బడి పిలుస్తోంది" ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వసతులపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్టులు, నోటు పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం పోషక విలువలతో కూడిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. డీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఉత్తమ ఉపాధ్యాయులు ఇక్కడ బోధిస్తున్నారని, ఒత్తిడి లేని ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎన్.లక్ష్మీ తులసి, పి.పుల్లయ్య, ప్రముఖ నాయకులు పాలకుర్తి శ్రీనుబాబు, ఉపాధ్యాయులు కే.జీ.భవాని, ఎన్.హరనాథ్, జి.జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే సేవలపై విద్యార్థులకు పోటీలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హై స్కూల్లో మంగళవారం రైల్వే సేవలపై ప్రధానోపాధ్యాయిని కే శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులకు విజయ వాడ డివిజన్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులచే వ్యాసరచన పోటీలు నిర్వహించారు. "హౌ రైల్వేస్ కనెక్ట్ పీపుల్ అండ్ డ్రీమ్స్" అంశంపై చిత్రలేఖనం, పోస్టర్ మేకింగ్, మై ఫ్రెండ్లీ రైల్వేస్, స్లొగన్స్ రైటింగ్–రైల్వేస్ ఒన్స్ –లెట్స్ కేర్ ఫర్ దెం పై క్విజ్, ఇండియన్ రైల్వేస్ అండ్ సేఫ్టీ అవేర్నెస్ మొదలగు వాటిపై పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. అలాగే పోటీల్లో మొదటి మూడు స్థానాల విద్యార్థులకు బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని ఆర్‌పిఎఫ్‌సిఐ కోట్ల మధు, ఎస్ఐ డి ప్రవీణ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిజే సాయి కే.అరుణ, ఏ.ఎల్.వి.కుమారి, నాగ మణి, శ్రీవల్లి శ్రీ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పిఎండిఎస్ కిట్టులపై రైతులకు శిక్షణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వరి అపరాలు వంటి బట్టలకు సంబంధించి పిఎండి ఎస్ కిట్టుల తయారీపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సామర్లకోట మండలం నవర గ్రామంలో మెంటల్ వ్యవసాయ అధికారి వి మురళీధర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ పద్ధతిలో 31 రకాల విత్తనాలు చల్ల ఎందుకు గాను ఈ మిశ్రమాన్ని ఎలా ఉపయోగించాలి, దాన్ని ఎలా తయారు చేయాలనే అంశా లపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ ఖర్చు తక్కువ, సాగునీటి ఆదా, నేల ఆరోగ్యం, పశువుల మేత, ప్రధాన పంటలకు మేలు అని అం శాలపై రైతులకు వ్యవసాయ అధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ నాగేశ్వరరావు, చంద్రన్న పాలెం నుంచి విచ్చేసిన ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది సాయి, గ్రామ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడి అమరులకు నివాళులర్పించిన సీఎం రేవంత్




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** పహల్గామ్ ఉగ్రదాడితో భారతదేశ ఐక్యతను దెబ్బతీయలేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం ఒక్కటిగా నిలుస్తోందన్నారు. జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు నేటితో ఏడాది పూర్తయింది. గతేడాది ఏప్రిల్ 22న పర్యాటకులపై దాడికి పాల్పడిన ముగ్గురు ఉగ్రవాదులు ఏకంగా 26 మందిని తుపాకులతో కాల్చి చంపారు. ఈ సందర్భంగా అమరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. వీరుల త్యాగం దేశానికి శాశ్వత రుణంగా నిలుస్తోందని.. ఉగ్రకుట్రలు ఎప్పటికీ విఫలమవుతూనే ఉంటాయన్నారు. దేశ ప్రజలు అప్రమత్తంగా ఐక్యంగా ఉన్నారన్నారు సీఎం రేవంత్. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో దేశం మట్నుత్తం మీతోనే ఉందంటూ బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ భరోసా ఇచ్చారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ కూడా పహల్గామ్ ఉగ్రదాడిపై స్పందించారు. బాధిత కుటుంబాలకు దేశం అండగా ఉందన్నారు. దాడికి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకున్నారు. దాడిలో మృతిచెందిన వారిని ఎన్నటికీ మరచిపోలేమని అన్నారు. ఈ బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దుఃఖం, సంకల్పంలో దేశ ప్రజలమంతా ఐక్యంగా నిలబడ్డామని ప్రధాని పేర్కొన్నారు. భారతదేశం ఉగ్రవాదానికి తలొగ్గదని.. వారి హేయమైన కుట్రలు ఎన్నటికీ సఫలం కావన్నారు.

# అదుపు తప్పిన థై స్లిట్ సొగసు.. వీళ్లకు డ్రెస్సింగ్ సెన్స్ నేర్పించేది ఎవరు?–



సినిమా ప్రమోషన్స్ అంటే కేవలం ముచ్చట్లు మాత్రమే కాదు.. తారల ఫ్యాషన్ మెరుపులు బోనస్ ట్రీట్ కూడా ఉంటుందనడానికి ఇదో చక్కని ఉదాహరణ. తాజాగా పతి పత్నీ ఔర్ వో 2 చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా సారా అలీ ఖాన్, వామికా గబ్బి, రకుల్ ప్రీత్ సింగ్ ముగ్గురూ కలిసి సందడి చేశారు. అయితే ఈ వేడుకలో సారా అలీ ఖాన్ – వామికా గబ్బి ధరించిన బోల్డ్ థై స్లిట్ డ్రెస్సులు అందరి దృష్టిని ఆకర్షించాయి. వీరిద్దరి గ్లామర్ డోస్ ముందు సీనియర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ కొంత వెలవెలబోయిందనే వ్యాఖ్యలు నెట్టింట వినిపిస్తున్నాయి. ముఖ్యంగా థై స్లిట్ లుక్‌లో సారా, వామికా పోటీ పడటంతో నెటిజన్ల మైండ్ బ్లాక్ అవుతోంది. ఈ ప్రమోషనల్ ఈవెంట్ కోసం సారా అలీ ఖాన్ ఫ్యూచరిస్టిక్ స్నేక్ స్కిన్ డిజైన్‌తో కూడిన సిల్వర్ మెటాలిక్ అవుట్‌ఫిట్‌ను ఎంచుకుంది. హై థై స్లిట్ డ్రెస్ సారాకు అత్యంత స్పెషల్ వైబ్ ని తీసుకొచ్చింది. సాధారణంగా క్లాసీగా కనిపించే సారా ఒక్కసారిగా ఈ రేంజులో రిస్కీ ఫ్యాషన్‌ను ఎంచుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు వామికా గబ్బి కూడా ఏమాత్రం తగ్గకుండా బ్లాక్ అండ్ వైట్ లెపార్డ్ ప్రింట్ వన్–షోల్డర్ డ్రెస్సులో మెరిసింది. ఆ ఇద్దరు భామల హై స్లిట్ షోని మరింత గ్లామరైజ్ చేసిందనే చెప్పాలి. అయితే ఈ ముగ్గురు భామల ఫ్యాషన్ ఎంపికలపై సోషల్ మీడియాలో.. ముఖ్యంగా రెడిట్‌లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్యాషన్ ప్రయోగాలు బావున్నా..ఈ అవుట్‌ఫిట్స్ మరీ చౌకగా అవుట్ డేటెడ్ స్టైల్‌లో ఉన్నాయని కొందరు నెటిజన్లు పెదవి విరిచేస్తున్నారు. వీరికి డ్రెస్సింగ్ సెన్స్ నేర్పించేది ఎవరు? అంటూ కొందరు ఎద్దేవా చేస్తుంటే.. సినిమా ప్రమోషన్ కంటే డ్రెస్సుల గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారని.. ఇది చిత్ర యూనిట్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రకుల్ ప్రీత్ సింగ్ ధరించిన భారీ లెపార్డ్ ప్రింట్ అవుట్‌ఫిట్ తన బాడీ ఫ్రేమ్‌కు ఏమాత్రం నప్పలేదని విమర్శలు వస్తున్నాయి. గోల్డ్ టోన్ క్రాప్ టాప్ .. భారీ బెలూన్ స్లీవ్స్ ఈ సీనియర్ బ్యూటీ లుక్‌ను దెబ్బతీశాయని ఫ్యాషన్ ప్రియులు భావిస్తున్నారు. ఇక సారా అలీఖాన్ తన సహజమైన రాయల్ లుక్‌ను పక్కన పెట్టి ఇలాంటి మెటాలిక్ షేడ్స్‌లోకి మారడం అభిమానులకు అస్సలు నచ్చలేదు. ఈ డ్రెస్సులన్నీ చూస్తుంటే కరోల్ బాగ్ మార్కెట్ వైబ్స్ వస్తున్నాయంటూ ఘాటుగా కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి పతి పత్నీ ఔర్ వో 2 ప్రమోషన్స్‌లో ఈ ముగ్గురు భామలు తమ గ్లామర్‌తో హీట్ పెంచాలని చూసినా.. అది కాస్తా ఫ్యాషన్ డిజాస్టర్‌గా మారిందని నెటిజన్లు తీర్పునిస్తున్నారు. నటీమణులు తమ స్టైలిస్టులను ఎంచుకోవడంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. లేకపోతే గ్లామర్ కాస్తా గాడి తప్పే ప్రమాదం ఉందని ఈ ఘటన నిరూపిస్తోంది. అందం ఉన్నా.. సరైన ఫ్యాషన్ ఎంపిక లేకపోతే అది ఎంతటి స్టార్ హీరోయిన్‌కైనా ఇబ్బందికరంగా మారుతుందనడానికి ఈ ఈవెంట్ ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# రాజా శివాజీతో జెనీలియా కుమారుడి డెబ్యూ!





తెలుగు ప్రేక్షకుల మనసు గెలుచుకున్న 'హాసిని' జెనీలియా తన తనయుడిని వెండితెరకు పరిచయం చేస్తోంది. జెనీలియా–రితేష్ దేశ్‌ముఖ్ దంపతుల చిన్న కుమారుడు రాహిల్ దేశ్‌ముఖ్ 'రాజా శివాజీ' సినిమాతో నటుడిగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథతో తెరకెక్కుతున్న ఈ చారిత్రాత్మక చిత్రంలో రాహిల్ 'బాల శివాజీ'గా కనిపిస్తుండటం విశేషం. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో రాహిల్ పలికించిన హావభావాలు, డైలాగులు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ తన కలల ప్రాజెక్ట్‌గా 'రాజా శివాజీ' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాకు ఆయనే స్వయంగా దర్శకత్వం వహించడం విశేషం. తన కుమారుడు రాహిల్‌ను ఒక పవర్‌ఫుల్ చారిత్రాత్మక పాత్ర ద్వారా ఇండస్ట్రీకి పరిచయం చేయాలని రితేష్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణంగా స్టార్ కిడ్స్ లవర్ బాయ్ ఇమేజ్‌తో ఎంట్రీ ఇస్తుంటారు, కానీ రాహిల్ మాత్రం చిన్న వయసులోనే ఒక గొప్ప వీరుడి పాత్రను ఎంచుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. ముంబైలో అట్టహాసంగా జరిగిన ట్రైలర్ లాంచ్ వేడుకలో రాహిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ట్రైలర్ ఆరంభంలోనే 'స్వరాజ్యం' గురించి రాహిల్ చెప్పే డైలాగులు రోమాంచితంగా ఉన్నాయి. చిన్ననాటి శివాజీ మహారాజ్ పరాక్రమాన్ని, ఆ పదునైన ఆలోచనలను తన నటనతో రాహిల్ ప్రతిబింబించాడు. కేవలం పదేళ్ల వయసులోనే ఇంతటి ఇంటెన్సిటీతో నటించడం చూస్తుంటే, తండ్రికి తగ్గ తనయుడిగా రాహిల్ పేరు తెచ్చుకోవడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమాకు మరో విశేషం ఏమిటంటే.. ఇందులో దేశ్‌ముఖ్ ఫ్యామిలీ అంతా భాగమైంది. జెనీలియా స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తూనే, ఒక కీలక పాత్రలో నటించింది. రితేష్ హీరోగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టగా, వారి చిన్న కుమారుడు రాహిల్ బాల శివాజీగా వెండితెరపై మెరవబోతున్నాడు. ఇక మరాఠా సామ్రాజ్య స్థాపకుడి గాథను ఇంత ప్రామాణికంగా, ఒక కుటుంబం అంతా కలిసి నిర్మించడం పట్ల అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తానికి 'రాజా శివాజీ' ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. యాక్షన్ సన్నివేశాలు, ఎమోషన్స్, మరియు రాహిల్ ఎంట్రీ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. మే 1న ఈ చారిత్రాత్మక దృశ్య కావ్యం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఛత్రపతి శివాజీగా రితేష్ గర్జన, బాల శివాజీగా రాహిల్ ముచ్చటైన నటన చూడాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. జెనీలియా తనయుడి సినీ ప్రయాణం ఈ గ్రాండ్ సక్సెస్‌తో మొదలవ్వాలని మనమూ కోరుకుందాం.

# పెళ్లి వార్తలపై వెల్లువెత్తిన ఊహాగానాలు!



ప్రముఖ బుల్లితెర నటి జెన్నిఫర్ వింగెట్ అద్భుతమైన నటనతోనే కాదు. వ్యక్తిగత జీవితంతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా ఆమె మళ్లీ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త నెట్టింట హల్చల్ చేస్తోంది. ఆమె సోషల్ మీడియా పోస్ట్‌పై వచ్చిన ఓ ఆసక్తికరమైన కామెంట్‌తో ఈ చర్చ మొదలైంది. ఈ కామెంట్ చూసిన అభిమానులు, జెన్నిఫర్ త్వరలోనే జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. విషయంలోకి వెళ్తే జెన్నిఫర్ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని అందమైన ఫోటోలను పంచుకుంది. ఆ ఫోటోలపై ఆమె సన్నిహితులు , స్నేహితులు చేసిన ఓ కామెంట్ అందరి దృష్టిని ఆకర్షించింది. అందులో పెళ్లికి సంబంధించిన ప్రస్తావన ఉండటంతో అది వైరల్‌గా మారింది. జెన్నిఫర్ కూడా ఆ కామెంట్‌కు స్పందించిన తీరు పుకార్లకు మరింత బలాన్ని చేకూర్చింది. దీంతో ఆమె అభిమానులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలపడం మొదలుపెట్టారు. జెన్నిఫర్ వింగెట్ గతంలో నటుడు కరణ్ సింగ్ గ్రోవర్‌ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల వీరిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత జెన్నిపర్ కెరీర్‌పైనే పూర్తి దృష్టి సారించింది. బేహద్, బేపన్నా వంటి సీరియల్స్‌తో స్టార్ హోదాను దక్కించుకుంది. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనా ఎక్కడా వెనకడుగు వేయకుండా నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఆమె మళ్ళీ ఆమెపై వివాహ వార్తలు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. ఈ ప్రచారంపై జెన్నిఫర్ వింగెట్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. సెలబ్రిటీల విషయంలో చిన్న చిన్న కామెంట్స్, ఫోటోలు పెద్ద ఎత్తున చర్చలకు దారితీయడం సహజమే. కొన్నిసార్లు అవి స్నేహితుల మధ్య జరిగే సరదా సంభాషణలు కూడా అవుతాయి. అయినప్పటికీ జెన్నిఫర్ వంటి పాపులర్ స్టార్ మళ్ళీ పెళ్లి చేసుకోబోతుందనే వార్త ఆమె ఫాలోవర్లలో ఒక రకమైన ఉత్సాహాన్ని నింపింది. ఆమెకు కాబోయే వరుడు ఎవరై ఉంటారనే దానిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి సంబంధించి ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే ఉంది.

జెన్నిపర్ స్వయంగా స్పందిస్తే తప్ప ఇందులో ఎంత నిజం ఉందో తెలియదు. ఏదేమైనా? జెన్నిఫర్ జీవితంలో ఏ నిర్ణయం తీసుకున్నా? ఆమె సంతోషంగా ఉండాలని అభిమానులు కోరుకుంటున్నారు. కెరీర్ పరంగా శిఖరా గ్రాన ఉన్న ఆమె వ్యక్తిగత జీవితంలోనూ అంతే సుఖ సంతో షాలతో ఉండాలని ఆశిస్తున్నారు.

# 25 ఏళ్ల తర్వాతే పూర్తి చేసిన రహస్యం!



భారతీయ చలనచిత్ర రంగంలో అప్రతిహతమైన స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ జీవితంలో ఆధ్యాత్మికతకు ప్రత్యేక స్థానముంది. వెండితెరపై రజనీ విన్యాసాలు కోట్లాది మందిని అలరిస్తే, తెర వెనుక ఆయన గడిపే ప్రశాంత జీవితం ఎందరికో ఆశ్చర్యం కలిగిస్తుంది. తాజాగా రజనీకాంత్ జీవితాన్ని మలుపు తిప్పిన ఓ పుస్తకం గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. అదే ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి. ఈ పుస్తకాన్ని కొన్న పాతికేళ్ల తర్వాత చదవడం విశేషం. రజనీకాంత్‌కు పుస్తకాలు చదవడం అనే అలవాటు ఒక రోజులో వచ్చింది కాదు. రామకృష్ణ ఆశ్రమం ప్రభావంతో ఆయనకు పఠనం పట్ల ఆసక్తి పెరిగింది. కెరీర్ ప్రారంభంలో మానసిక ప్రశాంతత కోసం వెతుకుతున్న సమయంలో ఆశ్రమ వాతావరణం, అక్కడి ఆధ్యాత్మిక గ్రంథాలు రజనీను ఎంతగానో ప్రభావితం చేశాయి. అప్పటి నుండి రజనీకాంత్ స్క్రిప్ట్‌లకే పరిమితం కాకుండా, లోతైన జీవన సత్యాలను బోధించే పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకున్నారు. అయితే పరమహంస యోగానంద రాసిన ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి పుస్తకాన్ని ఆయన 25 ఏళ్ల క్రితమే కొనుగోలు చేశారు. చిత్రమైన విషయం ఏమిటంటే? ఆ పుస్తకం ఆయన దగ్గరే ఉన్నా దానిని పూర్తిగా చదవడానికి మాత్రం పావు శతాబ్దం సమయం పట్టింది. పుస్తకాలు చదవడం అంటే పేజీలు తిప్పడం కాదు. ఆ సమాచారాన్ని స్వీకరించే సరైన సమయం రావాలని రజనీకాంత్ నమ్ముతారు. బహుశా ఆయనలోని ఆధ్యాత్మిక పరిణితి ఆ పుస్తకంలోని సత్యాలను అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవడానికి 25 ఏళ్ల కాలం అవసరమైందేమో. ఈ పుస్తకం చదివిన తర్వాతే రజనీకాంత్‌లో ఎన్నో మార్పులొచ్చాయన్నారు. అందులోని బాబాజీ గురించిన విశేషాలు ఆయనను ఎంతగానో ఆకర్షించాయి. రజనీకాంత్ బాబా సినిమాకు కూడా ఈ పుస్తకమే ప్రధాన ప్రేరణ అని పలు సందర్భాల్లో వెల్లడించారు. ఒక పుస్తకం ఒక మనిషి ఆలోచనా దృక్పథాన్ని ఎలా మార్చగలదో చెప్పడానికి రజనీకాంత్ ప్రయాణమే మంచి ఉదాహరణ. వేల కోట్ల సామ్రాజ్యం, అంతులేని కీర్తి ఉన్నప్పటికీ, ఆయన వెతుకుతున్న శాంతి ఆ పుస్తకంలోని అక్షరాల్లోనే దొరికిందని ఆయన నమ్ముతారు. రజనీకాంత్ వంటి అగ్ర కథానాయకుడు ఇలాంటి విషయాలను పంచుకోవడం వల్ల సమాజంలో ముఖ్యంగా యువతలో పుస్తక పఠనం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. భౌతిక విజయాలే జీవితం కాదని, అంతర్గత ప్రయాణం కూడా ముఖ్యమని రజనీకాంత్ ప్రవర్తన ద్వారా నిరూపిస్తున్నారు. రామకృష్ణ ఆశ్రమం వేసిన పునాది, ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఏ యోగి రజనీకాంత్‌ను ఓ విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది. పుస్తకాలు చదవడం అనేది నిరంతర ప్రక్రియ. కొన్ని పుస్తకాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. మరికొన్నిటిని మనం వెతుక్కుంటూ వెళ్తాం.

# క్రీడా మైదానంలో అట్టహాసంగా జి.పి.ఎల్ - 3 ఆక్షన్ కార్యక్రమం

## - జి.పి.ఎల్ - 3 ఆక్షన్‌లో పాల్గొన్న ఐదు జట్లు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మరో క్రికెట్ సంబరానికి వేదిక కానుంది. కొద్ది రోజులలో జరగబోయే జి.పి. ఎల్ - 3 సంబరానికి ఆక్షన్ కార్యక్రమం జరిగింది. జి.పి.ఎల్ - 1 2023 వ సంవత్సరం వేసవికాలంలో జరిగింది. జి.పి.ఎల్ - 2 2026 సంక్రాంతి సందర్భంగా జరగగా, జి.పి.ఎల్ - 3, 2026 ఏప్రిల్ 26 లేదా 27వ తేదీల్లో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు విలేకరులకు తెలియజేశారు. గజపతినగరం క్రీడా మైదానంలో జి.పి.ఎల్ -3 కి సంబంధించి ఆక్షన్ కార్యక్రమం సోమవారం (20-04-2026) సాయంత్రం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు జరిగింది. ఈ ఆక్షన్ కార్యక్రమంలో సుమారు 65 నుంచి 70 మంది ఆటగాళ్ల కొనుగోలు కోసం ఐదు జట్లు పోటీపడ్డాయి.

జట్ల వివరాలు : 1). డ్రీమ్స్ బ్రోస్ 11, 2). లక్ష్మి ఎంటర్ప్రైజెస్, 3). మహేష్ వారియర్స్, 4). శ్రీ వెంకటేశ్వర క్యాటరింగ్ లెవెన్స్, 5). ఉదయ్ - నితిన్ సూపర్ కింగ్స్. ఆక్షన్‌లో లక్ష్మీపతి బాలాజీని అత్యధికంగా 4,900 పాయింట్లతో మహేష్ వారియర్స్ దక్కించుకోగా, చాణక్యను 4800 పాయింట్లు, మజ్జి సాయిను 4400 పాయింట్లతో శ్రీ వెంకటేశ్వర క్యాటరింగ్ 11'S జట్టు దక్కించుకుంది. జి.పి.ఎల్ - 3 క్రికెట్ క్రీడా పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు. జి.పి.ఎల్ - 3 వేసవి సెలవుల్లో జరుగుతుండడంతో గజపతినగరం చుట్టుప్రక్కల ప్రాంతాలకు సంబంధించిన యువత, వివిధ గ్రామాల ప్రజలు ఈ క్రికెట్ సంబరాన్ని అధిక సంఖ్యలో వీక్షించే అవకాశం ఉందని నిర్వాహకులు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆటగాళ్లు కర్రీ నానాజీ, తాడి శ్రీనివాసరావు, శిరివూరి శ్రీనివాసరాజు, రాజగోపాల్, తోనంగి శ్రీను, డివిఆర్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

## - మంత్రి కొండపల్లి ఆధ్వర్యంలో నెలివాడలో మెగా రక్తదాన శిబిరం - రక్తదానం చేసి సమాజానికి, యువతకు ఆదర్శంగా నిలిచిన మంత్రి "కొండపల్లి" - 57వ సారి రక్తదానం చేసిన డి.వి.ఆర్ మాస్టారు







**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని నెలివాడ ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. "రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడం ద్వారా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాజానికి, యువతకు ఆదర్శంగా నిలిచారు". ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అలుపెరుగని నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఆయన పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానంతో సమానమని, యువత ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి నియోజకవర్గ స్థాయి నుంచి భారీగా స్పందన లభించింది. ఈ మెగా రక్తదాన శిబిరంలో 316 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. ముఖ్యంగా డివిఆర్ మాస్టారు 57వ సారి రక్తదానం చేయడం ఈ రక్తదాన శిబిరంలో జరిగిన గొప్ప విషయం. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, మెడికల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూసేకరణ త్వరగా పూర్తిచేసి భూములు అప్పగించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో కొనసాగుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రైల్వే లైన్లు మరియు జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించారు. నిర్దేశించిన గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తోటపల్లి, తారకరామ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టులపై సమీక్షించారు. రైల్వే ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ, విజయనగరం - సంబల్‌పూర్ మూడవ లైన్ పనులు, కొత్తవలస - విజయనగరం నాలుగో లైన్ మరియు ఖుర్దా రోడ్ - విజయనగరం మూడవ లైన్ పనులకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్లు, స్ట్రక్చర్ వ్యాల్యుయేషన్ రిపోర్టులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులైన ఎన్ . హెచ్.-516డీ (పెందుర్తి - బొబ్బిలి) మరియు ఎన్హెచ్-130 సిడి (రాయ్‌పూర్ - విశాఖపట్నం) పనులకు భూసేకరణ అవార్డులు జారీ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తయ్యేలా రెవెన్యూ మరియు రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఈ సమావేశంలో ఆదేశించారు. మున్సిపాల్టీల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం కోసం ప్రతిపాదించిన ఎస్టీపీలకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్, డిఆర్వో సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు వివిధ శాఖల ప్రతినిధులు, తహసీల్దార్లు, ఎల్ఏ యూనిట్ల డిటిలు పాల్గొన్నారు.

# సిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి - పరిశుభ్రత లోపిస్తే కాంట్రాక్ట్ రద్దు







**బాడంగి, (విజయనగరం), (రాజధాని వార్తలు):** మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్సి)ను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఓపీ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, అనంతరం వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు వ్యాధులు తగ్గాల్సింది పోయి, అపరిశుభ్రత వల్ల కొత్త రోగాలు వచ్చేలా ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. పరిశుభ్రత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోపు ఆసుపత్రి అంతటా పరిశుభ్రత మెరుగుపడాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా మార్పు రాకపోతే సదరు కాంట్రాక్ట్‌ను తక్షణమే రద్దు చేసి, బాధ్యతలను వేరే వారికి అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యంతో పాటు ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండటం అత్యంత ముఖ్యమనీ, ఇందులో ఎలాంటి రాజీ పడకూడదనీ కలెక్టర్ పేర్కొన్నారు.

# బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక బస్సు యాత్ర : జిల్లా కలెక్టర్, ఎస్పీ, తాసిల్దార్





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ప్రమాదాలకు కారణమవుతున్న "బ్లాక్ స్పాట్‌ల"ను గుర్తించి, శాశ్వత పరిష్కారాల కోసం అధికారులు బస్సు యాత్ర నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పన్నెండు శాఖల అధికారులతో కలిసి తిరుపతి నుంచి నాయుడుపేట వరకు ఈ యాత్ర సాగింది. మార్గమధ్యంలో ప్రమాదాలకు కేంద్రంగా మారిన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రేణిగుంటలోని గాజుల మండ్యం సర్కిల్ వద్ద బస్సు ఆపి, తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. ప్రమాదాలకు దారి తీస్తున్న ఇంజనీరింగ్ లోపాలు, రోడ్డు రూపకల్పనలో ఉన్న సమస్యలు, వాహనాల అతివేగం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మరియు ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట తాసిల్దార్ జి.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ బ్లాక్ స్పాట్‌లలో కేవలం లోపాల సవరణకే పరిమితం కాకుండా, స్పీడ్ గన్స్ ఏర్పాటు, వీధి దీపాల మెరుగుదల, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ బలోపేతంపై అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా వెస్ట్ బైపాస్ ప్రారంభమైన తర్వాత ప్రమాదాలు పెరిగినట్లు గుర్తించిన అధికారులు, దీనిపై ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు."జిల్లాలో ఉన్న అన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాలను తగ్గించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని, ప్రమాదాల అసలు కారణాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, శాశ్వత పరిష్కారాలు అమలు చేస్తాం" అని వెల్లడించారు. అధికారుల ఈ చర్యలతో రాబోయే రోజుల్లో రోడ్డు ప్రమాదాల తీవ్రత గణనీయంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు.

# ఖర్గే వ్యాఖ్యలు.. ప్రజలను అవమానించడమే

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**హైదరాబాద్, న్యూఢిల్లీ, (రాజధాని వార్తలు):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీని 'తీవ్రవాది'గా సంబోధించడం దేశ ప్రజలను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మూడోసారి ప్రధానిగా సేవలందిస్తున్న మోదీకి 25 ఏళ్ల పాలనా అనుభవం ఉందని ఆయన పేర్కొన్నారు. జకీర్ నాయిక్‌ను 'శాంతి దూత'గా పేర్కొనడమేంటీ? అని ఆయన నిలదీశారు. మల్లికార్జున ఖర్గే.. ప్రధాని మోదీపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మోదీని ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని ఖర్గే గుర్తుపెట్టుకుని ఉంటే బాగుండేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానిపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందన్నారు. ఖర్గే వ్యాఖ్యలు పూర్తిగా అవమానకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. 'ప్రధానిని 'టెర్రరిస్ట్' అని సంబోధించడం అవమానకరం. ఇలాంటి భాష ప్రజల తీర్పును అవమానపరుస్తుంది' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీపై ఖర్గే వ్యాఖ్యలు అనుచితమైనవని, ఆమోదయోగ్యం కానివని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. ఖర్గే, ఎంకే స్టాలిన్, రాహుల్‌గాంధీ దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# అంగన్వాడి ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఐసిడిఎస్ పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఓ జి ఉష తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూ పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త ఖాళీకి, 24 అంగన్వాడీ హెల్పర్ల ఖాళీల భర్తీకి గాను జిల్లా కలెక్టర్, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈనెల 21వ తేదీ నుంచి మే ఆరవ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామంలో ఉన్న పెద్ద వీధిలో అంగన్వాడీ కార్యకర్త ఖాళీకి "ఓసి" రిజర్వేషన్ నుండి దరఖాస్తులు స్వీకరిస్తునట్టు తెలిపారు. అలాగే అంగన్వాడీ హెల్పర్ల విషయంలో సామర్లకోట అర్బన్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంతంలో కేంద్రానికి ఓసి క్యాటగిరిలోను, సంగీతరావుపేట 14వ వార్డులో కేంద్రానికి "బీసీ (బి)" క్యాటగిరిలోనూ, బ్రౌన్ పేట 2 నాలుగో వార్డ్ కేంద్రానికి "ఎస్సీ (సి)" కేటగిరి నుంచి, లారీ ఆఫీస్ 30 వ వార్డులోని కేంద్రానికి "ఓసి (ఈడబ్ల్యూఎస్)" క్యాటగిరి నుంచి, రెల్లి పేట 17వ వార్డులోని కేంద్రానికి "ఎస్సీ (సి)" క్యాటగిరి నుంచి, చాకలిపేట 5వ వార్డులోని కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి, గణేష్ కాలనీ 1 మూడవ వార్డు కేంద్రానికి "ఎస్సీ (సీ)" కేటగిరి నుంచి, సామర్లకోట మండలం పెద్ద బ్రహ్మదేవం గ్రామంలోని గణపతి పేట అంగన్వాడీ కేంద్రానికి "ఓసి" (ఈడబ్ల్యూఎస్)" కేటగిరి నుంచి, అదే గ్రామం భాస్కర కాలనీ కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి, పనసపాడు గ్రామంలోని పంచా యతీ ఏరియా 2 కేంద్రానికి "ఎస్టి" క్యాటగిరి నుంచి, వీకే రాయపురం గ్రామం లోని కొత్తూరు 2 కేంద్రానికి "బిసి (బి)" కేటగిరి నుంచి, చంద్రంపాలెం గ్రామంలోని కేంద్రానికి "బిసి (బి)" కేటగిరి నుంచి, పవర గ్రామం కేంద్రం నుంచి "బిసి (డి)" కేటగిరి నుంచి, మాధవపట్నం గ్రామం కేంద్రానికి "బిసి (ఇ)" కేటగిరి నుంచి, మాధవపట్నం పిల్లి పేట కేంద్రానికి "బిసి(బి)" కేటగిరీ నుంచి, కాపవరం గ్రామం "ఓసి" ఏరియాలోని కేంద్రానికి "బిసి (డి)" కేటగిరి నుంచి దరఖాస్తులు స్వీకరించుతు న్నట్టు తెలిపారు. పెద్దాపురం మండలానికి సంబం ధించి హెల్పర్ల ఖాళీల భర్తీకి గాను పెద్దాపురం అర్బన్ కట్టమూరు పొంత 3వ వార్డు కేంద్రానికి "ఓసి" కేటగిరీ నుంచి, పెద్దాపురం అర్బన్ పల్లి వీధి రెండవ వార్డ్‌కు సంబంధించి "ఓసి" కేటగిరి నుంచి, పెద్దాపురం మండలం పులిమేరు 1 కేంద్రానికి "ఓసి (ఈడబ్ల్యూఎస్)" కేటగిరి నుంచి, మర్లావ 4 కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి, కట్టమూరు 6 కేంద్రానికి "ఎస్సి(సి)" కేటగిరి నుంచి, కట్టమూరు 7 కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి, వడ్లమూరు 2 కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి, గోరింట 1 కేంద్రానికి "ఓసి" కేటగిరి నుంచి ఖాళీల భర్తీకి గాను అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులు స్థానిక వార్డుకు చెందిన వారై వివాహిత మహిళ అభ్యర్థులై ఉండాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి పుట్టిన తేదీ నిర్ధారణ ధ్రువపత్రం దరఖాస్తుకు జతపరచాలన్నారు. 2026 జూలై ఒకటవ తేదీ నాటికి 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాలలోపు వారై ఉండాలన్నారు. అర్హులైన దరఖాస్తుదారులకు సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి దాని ఆధారంగా ఖాళీలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో అభ్యర్థులు అందరూ విధిగా ఈడబల్యు ఎస్ ధ్రువపత్రం దరఖాస్తుకు జతపరచాలని, మీ ఆరో తేదీలోగా దరఖాస్తులను పెద్దాపురం ఐసిడిఎస్ కార్యాలయంలో కార్యాలయం పని వేళల్లో అందించాలని సిడిపిఓ ఉష తెలిపారు.

# టిడ్కో రుణాలు రద్దు కోరుతూ సిపిఎం ధర్నా




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో టిడ్కో గృహాల రుణాలు రద్దు చేయాలని మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ సామర్లకోట పట్టణ జగ్గమ్మగారి పేటలోని టిడ్కో గృహ సముదాయాలు సుమారుగా 500 గృహాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేసిన ఈ గృహాలు ఆనాడు లబ్ధిదారులకు జి+1 నిర్మిస్తామని చెప్పి తరువాత దానిని జి+3 గా మార్పు చేశారన్నారు. ఒక్కొక్క ప్లాట్‌కి రూ. 7.50 లక్షల విలువ నిర్ణయించగా దీనిలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 1 లక్ష 50 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ. 1 లక్ష 50 సబ్సిడీ మొత్తంగా రూ. 3 లక్షలుగా నిర్ణయించారన్నారు. లబ్ధిదారుల నుంచి అడ్వాన్సుగా ఒక లక్ష రూపాయలు తీసుకున్నారని, మిగిలిన రూ. 3.5 లక్షల రుణం ప్రతి నెల బ్యాంకులో చెల్లించమని చెప్పారన్నారు. కానీ వాస్తవంలో చూస్తే నెలకు రూ. 4000 చొప్పున 20 సంవత్సరాలు చెల్లించమని చెప్తున్నారన్నారు. ఇలా చూస్తే ఈ మొత్తం సుమారు 10 లక్షలు అవుతుందని, ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాల్సిన ఇళ్లకు రూ. 3.5 లక్షలు రుణం అని చెప్పి, రూ. 10 లక్షలు వసూలు చేయడం వల్ల తీవ్రమైన రుణ భారం అవుతుందన్నారు. ఇది ఒక కోణం అయితే మరొక కోణం ఏమిటంటే బ్యాంకుల వైఖరి ఎలా ఉందంటే, ఎవరైతే టిడ్కో లబ్ధిదారులు ఉన్నారో వారికి డ్వాక్రా రుణాలు వచ్చిన సరే వారికి ఇవ్వ కుండా దీనిలో జమ చేసుకుంటున్నారన్నారు. మరో వైపు తల్లికి వందనం సొమ్ములు కూడా దీనికి జమ చేసుకుంటున్నారని, బంగారంపై తీసుకున్న రుణాల సొమ్మును కూడా దీనికి జమ వేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల సొమ్మును లబ్ధిదారులకు చెందకుండా బ్యాంకులు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల మాదిరిగా దోచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడ్కో గృహాల రుణాలు చెల్లించవద్దని, రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. కాబట్టి తక్షణమే ప్రజలకు రుణ భారంగా ఉన్న టిడ్కో గృహాల రుణాలను రద్దు చేసి, ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందులో చాలా గృహాలు లీకుల వల్ల పై ఫ్లోర్‌లోని నీరు క్రింది ఫ్లోర్‌లోకి వచ్చి, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 20 సంవత్సరాలు తరువాత పరిస్థితి ఎలా ఉంటుందో మీరే గమనించాలని తెలుపుతూ తక్షణమే రుణాలు ఇచ్చిన బ్యాంకుల ఆగడాలు అరికట్టాలి, రుణాలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్ వరలక్ష్మి, కే.ఎన్.వెంకటలక్ష్మి, డి.లక్ష్మి, జి. వీరమణి, ఎన్. శాంత లీల, ఎం.సత్యవతి, ఎం.బాల త్రిపుర సుందరి, ఎన్. విజయలక్ష్మి, పి.వరలక్ష్మి, ఎన్.శివ, పి.రాము. కే.రామకృష్ణ సిపిఎం నాయకులు బాలం సత్తిబాబు, కే.తులసి దాస్, బాలం హరిబాబు, కరణం ఏడుకొండలు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఆర్టీసీ సమ్మె విరమించాలని విజ్ఞప్తి : మంత్రి పొన్నం



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో నిన్న(మంగళవారం) జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేశారు కార్మికులు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాల్సిందే అంటూ ఆర్టీసీ జేఏసీ సమ్మె సైరన్ మోగించింది. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. 'ఆర్టీసీ సోదరులకు నా కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి. సంస్థ పరిరక్షణ, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా.. సమ్మె విరమించాలని కోరుతున్నాను. సమస్యకు సమ్మె పరిష్కారం కాదు.. నలుగురు అధికారులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. నాలుగు వారాల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించాం. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యతిరేకతా లేదు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండూ పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉంది. అధ్యయనం చేయడానికి నాలుగు వారాల గడువు అడిగాం. ఈ రెండు అంశాలూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గర చర్చిస్తామని నలుగురు అధికారుల కమిటీకి తెలియజేశాం' అని మంత్రి తెలిపారు. 'ఆర్టీసీ విలీనం ఆలస్యమైనా ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయి. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం నాయకత్వ అంశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పడగానే గతంలో పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీ క్లియర్ చేశాం. పెండింగ్ డీఏలు లేకుండా క్లియర్ చేశాం. 2013 పెండింగ్ బాండ్స్ క్లియర్ చేశాం. రూ.1205 కోట్లు ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు తగ్గించాం. రూ.690 కోట్లు ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించాం. ఇవే కాకుండా నెల వారీగా పీఎఫ్, సీసీఎస్‌కి రూ.75 కోట్లు చెల్లిస్తున్నాం. ఉద్యోగులపై పనిభారం పడకుండా ఉండడానికి 4,538 ఉద్యోగాల నియామకాలు భర్తీ త్వరలోనే పూర్తవుతుంది' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 'అలానే సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న 1134 కారుణ్య నియామకాలు చేపట్టాం. గత ప్రభుత్వంలో వివిధ కారణాలతో శాశ్వతంగా సర్వీసు నుంచి రిమూవ్ అయిన వారిలో ఇప్పటి వరకు దాదాపు 250 మందికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. అన్ని అంశాలు పరిష్కారం చేస్తాం. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది.. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు చేయొద్దు. గత ప్రభుత్వంలో 10 ఏళ్లుగా ఆర్టీసీలో ఏం జరిగిందో కార్మికులందరికీ తెలుసు. రోజూ 65 లక్షల మంది ప్రయాణం చేస్తుంటే.. అందులో 45 లక్షల మంది మహిళలే ఉన్నారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం పక్షాన విజ్ఞప్తి చేస్తున్నా' అని మంత్రి అన్నారు. 'మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరు. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలుసుకోవచ్చు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు. పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు కలగజేయవద్దు. పేదలకు కార్లలో పోయే స్థోమత లేదు. కాబట్టి ప్రతి ఒక్క ఆర్టీసీ కుటుంబ సభ్యుడికి, కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నా.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరఫున కొట్లాడి సాధించుకుందాం. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుంది. మీ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా ఉన్నాం. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు. నేను విద్యార్థి నాయకుడిని కార్మికులకు అండగా ఉంటా. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు లైఫ్ లైన్ అయిన ఆర్టీసీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి. మీ నాయకులకు నిరసనలు తెలియజేసే హక్కు ఉంది.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని విజ్ఞప్తి చేస్తున్న' అని ఆర్టీసీ కార్మికులకు పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# చెరువుల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి

**- అధికారులు 10 రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయాలి - జలధార - నీటి భద్రత ద్వారా భూగర్భ జల మట్టాలను పెంచాలి - జలధార నీటి భద్రతపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని జలవనరుల పరిరక్షణ మరియు సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సంబంధిత అధికారులతో జలధార – నీటి భద్రతపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో జలధార – నీటి భద్రత కింద చేపడుతున్న పనుల వలన భూగర్భ నీటి మట్టాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా నీటి వనరుల నిల్వలు పెంచడానికి, నీటిని సంరక్షించడానికి, సాగు నీటి వ్యవస్థ బలోపేతం అవడానికి ప్రణాళికలు తోడ్పడాలన్నారు. ఇందులో భాగంగా 'జలధార' కార్యక్రమంలో భాగంగా రాబోయే 10 రోజుల్లో పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న 64 గొలుసుకట్టు చెరువులకు సంబంధించి వాటి పరిధిలోని 268 చిన్న తరహా చెరువులను, వాటికి అనుబంధంగా ఉన్న కాలువలను త్వరితగతిన అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. వీటి పునరుద్ధరణ పనుల కోసం సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. చెరువులలో బెడ్ లెవల్ కంటే అదనంగా డీసిల్టింగ్ చేస్తున్న పనులను గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులను వెంటనే రద్దు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

కొత్తగా డీసిల్టింగ్ చేయాల్సిన అవసరం ఉన్న చెరువులను కూడా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు. గొలుసుకట్టు చెరువులకు సంబంధించి దెబ్బతిన్న కట్టలు, సర్ ప్లస్ వేర్స్, మరియు షట్టర్ల పునరుద్ధరణ కోసం సుమారు 60 అంశాలతో కూడిన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ పనుల నిర్వహణలో పీడీ డ్వామా, ఇరిగేషన్ ఈఈ, డీఈ, ఏఈఈలతో పాటు ఎంపీడీవోలు సమన్వయంతో పనిచేయాలని, త్వరితగతిన అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జిల్లాలోని జలవనరులను కాపాడుకుంటూ, రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ 'జలధార' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో డ్వామా పిడి, ఇరిగేషన్ అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిందేపల్లి శ్రీ సిద్ధేశ్వరాలయంకు 200 కుర్చీలు వితరణ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లాలోని ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి దేవాలయానికి కెనరా బ్యాంక్ తిరుపతి మెయిన్ బ్రాంచ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఉమాపతి ఆధ్వర్యంలో 200 కుర్చీలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు మంగళవారం దాతలు లక్ష రూపాయలు విలువచేసే కుర్చీలను ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో దాతలకు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయం చరిత్రను వారికి వివరించారు. అనంతరం పండితులు ఆశ్చర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందించారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మె.. హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** టీజీఎస్ ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైళ్ల సంఖ్య, ఫ్రీక్వెన్సీ పెంచాలని నిర్ణయించారు. ఆర్టీసీ సమ్మె ముగిసేవరకూ 56 మెట్రో రైళ్లను నడపనున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. మియాపూర్– ఎల్.బి. నగర్ కారిడార్‌లో 4 నిమిషాల 20 సెకన్ల విరామంతో, అలాగే నాగోల్– రాయదుర్గం కారిడార్‌లో 3 నిమిషాల 40 సెకన్ల విరామంతో రోజంతా గరిష్ఠంగా 56 రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. చివరి మెట్రో రైలు సర్వీస్ రాత్రి 11 గంటల తర్వాతా పొడిగించేలా చర్యలు చేపట్టినట్లు మెట్రో అధికారులు పేర్కొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ వి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి : ప్రగతి స్వచ్ఛంద సంస్థ






**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం చైతన్యపురం గిరిజన కాలనీలో పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కలిగిం చారు. ఈ సందర్భంగా ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల భవిష్యత్తు తీర్చబడుతుందని నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం, తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తు న్నారని, ప్రతి బిడ్డను బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యతోనే అభివృద్ధి సాధిస్తామని బాల కార్మిక వ్యవస్థ బాల్య వివాహాలు నిర్మూలనకు విద్య తోడ్పడుతుందని పిలుపునిచ్చారు. ఇంటింటా కరపత్రములు, ప్లే కార్డ్స్ చేతపట్టి ప్రభుత్వ విద్య ఉచిత విద్య ప్రభుత్వ బడి అందరి బడి ఎక్కడికో ఎందుకు దండగా మన ఊరిలో ప్రభుత్వ బడి ఉండగా పిల్లలందరినీ చదివిద్దాం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దాం ఆడపిల్లలు చదువు దేశానికి వెలుగు ప్రభుత్వ పాఠశాల ప్రగతికి బాట నినాదాలు చేస్తూ, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు అంగన్వాడి టీచర్ మల్లేశ్వరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. కృష్ణయ్య, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని మెరుగైన విద్య ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్నారని మీ పిల్లల యొక్క పురోగతికి తోడ్పడాలని తల్లిదండ్రులకు చెప్పడం జరిగింది. ఉపాధ్యాయులు లోకనాథం, శోభ, గుణావతి, గ్రామస్తులు గ్రామంలో ఇంటింటా తిరిగి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని అవగాహన కల్పించారు.

# జగన్ మాజీ సీపీఆర్ఓ శ్రీహరి అభ్యర్థనను తోసిపుచ్చిన ఏపీ హైకోర్టు

**అమరావతి, (రాజధాని వార్తలు):** తమను అరెస్టు చేయకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాజీ సీపీఆర్ఓ శ్రీహరి, వైసీపీ సోషల్ మీడియా నేత గిరీశ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్‌లు వేసిన సంగతి తెలిసిందే. శ్రీహరి, గిరీశ్‌ల పిటిషన్‌లపై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. ఇద్దరి అభ్యర్థనలను కోర్టు తిరస్కరించింది. అరెస్టు చేస్తారనేందుకు ఆధారాలు ఉన్నాయా అని హైకోర్టు ప్రశ్నించింది.

కుప్పం కోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేశామని, రద్దు చేయలేదని తెలిపింది. చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాల్సిన అవసరమేముందని ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

# పిఠాపురం ప్రొటోకాల్ అంశం.. నేతల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



**అమరావతి, (రాజధాని వార్తలు):** పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు.

**పాడా సమావేశం వివాదం..**

పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా) సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.

**గొడవలు పడటం సరైన పద్ధతి కాదు: సీఎం**

ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాస రావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే పరిటాల సునీత



**రాప్తాడు, అనంతపురం, (రాజధాని వార్తలు):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ 22 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ రూ. 1.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, పుల్లలరేవులో రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ 22 నెలల్లోనే రాప్తాడు మండలంలో రూ.26 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ తారు రోడ్డు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్, నల్లాని ప్రసాద్, జాఫర్, గంగలకుంట రమణ, మరూరు గోపాల్ పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan